విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శుక్రవారం 29 నవంబర్ 2024 | 8 పేజీలు

విజృంభిస్తున్న జ్వరాలు

- డెంగ్యూ, చికున్ గున్యాతో ఇబ్బందులు
- జ్వరంతో పాటు జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు
- అందని ప్రభుత్వ వైద్యం
- ప్రైవేటు వైద్యశాలలకు రోగుల పరుగులు
- రకరకాల పరీక్షల పేరుతో సొమ్ము చేసుకుంటున్న ప్రైవేటు వైద్యులు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : జిల్లాను సీజనల్ వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ఎక్కడ చూసినా డెంగ్యూ, చికున్‌గున్యాతో పాటు జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులుతో జనం బాధపడుతున్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు చేసినప్పటికీ ఎటువంటి ఇబ్బంది లేదని వైరల్ ఫీవర్‌లని వైద్యులు చెబుతున్నారు. అయితే సాధారణ జ్వరాలు, ఒళ్లు నొప్పుల నుండి ప్రభుత్వం నుంచి సరైన వైద్య సేవలు అందకపోవడంతో రోగులు ప్రైవేటు వైద్యశాలలకు ఆర్‌ఎంపీ వైద్యుల దగ్గరకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి వైరల్ ఫీవర్‌లు మూడు నుంచి నాలుగు రోజులు తగ్గుముఖం పడతాయి. కానీ ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల వలన జ్వరాలు, జ్వరంతో పాటు టైఫాయిడ్, చికున్ గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకి జనం ఇబ్బంది పడుతున్నారు. గ్రామీణ మండలాల్లో ప్రభుత్వ వైద్యశాలల్లో డాక్టర్ల కొరత ఉండటం, నాణ్యమైన వైద్య పరికరాలు లేకపోవడం ప్రతి వ్యక్తికి కామన్‌గా ఉన్న మాత్రలు ఇవ్వడం తప్ప రక్త పరీక్షలు చేసి వ్యాధిని గుర్తించి ఆ వ్యాధికి అవసరమైన మెడిసిన్ ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో లేకపోవడంతో రోగులు స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపి డాక్టర్ల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. వారి దగ్గర రెండు మూడు రోజులు చికిత్స తీసుకొని అయినప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో కార్పొరేట్ వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. అక్కడికి వెళ్లడంతో ఓపి దగ్గర నుంచి నాలుగైదు రకాల బ్లెడ్ టెస్ట్‌లు, యూరిన్, ఎక్స్‌రే, స్కానింగ్‌ల పేరుతో ఒక వ్యక్తి దగ్గర నుంచి మూడు నుంచి ఐదు వేల వరకు పరీక్షలకే డబ్బులు దండుకుంటున్నారు. అన్ని పరీక్షలు చేసిన తరువాత ఇది వైరల్ ఫీవర్ వాతావరణంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా వచ్చి వుంటాయి వారం రోజుల పాటు ఈ బిల్లలు - మిగతా 2 లో

పూలే ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందించాలి

మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి

సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహాత్మా జ్యోతి బా పూలే ఆదర్శాలను ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఒంగోలు నగరంలోని నూతన కూరగాయల మార్కెట్ వద్ద పూలే విగ్రహానికి పూల మాలవేశారు. 2లో

నీటి సంఘాల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : నీటి సంఘాల ఎన్నికలు సమర్థంగా నిర్వహించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై జల వనరులు, రెవిన్యూ శాఖ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయకట్టు భూములలో పంటలు సాగు చేస్తున్న రైతులందరికీ ఓటు హక్కు ఉండాలని కలెక్టర్ చెప్పారు. డిసెంబర్ 8వ తేదీన నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల అధికారుల నియామకం తదితర ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలన్నారు. పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సిసిఆర్‌సి కార్డుదారులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా లా అండ్ ఆర్డర్ సమస్యలు రాకుండా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలన్నారు. మండల స్థాయిలోని అధికారులకు డివిజన్ స్థాయిలో - మిగతా 2 లో

సీఎం చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు

రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

విశాలాంధ్ర - బాపట్ల : విద్యార్థుల ప్రగతిపై నిర్వహించే తల్లిదండ్రుల సమావేశానికి 7న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో విద్యాశాఖ కమిషనర్ బుధవారం బాపట్లకు చేరుకున్నారు. సీఎం పర్యటనపై జిల్లా కలెక్టర్‌తో చర్చించారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు హాజరయ్యే మున్సిపల్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణలోని ప్రతి తరగతి గదిని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళితో కలిసి ఆయన పరిశీలించారు. విద్యార్థుల ప్రగతి, విద్యా బోధనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని ఆయా భవనాలు, తాగునీటి వసతి, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షల నిర్వహణ, హెల్త్ కార్డుల జారీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రధానంగా విద్యార్థుల ప్రగతిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. 912 మంది విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిసెంబర్ 7వ తేదీన హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో స్ఫూర్తినింపడానికి ఉన్నత స్థాయికి ఎదిగిన ఈ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. విద్యార్థులే ఆహ్వాన పత్రికలు సిద్ధం చేసేలా చూడాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో వసతి పొందుతూ ఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రతి తరగతి గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే కార్యక్రమంలో వేదికను సిద్ధం చేసుకోవాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. విద్యార్థుల తల్లులకు రంగవల్లుల పోటీలు, విద్యార్థుల తండ్రులకు టగ్గాఫ్ వార్ పోటీలను నిర్వహించాలన్నారు. విద్యార్థుల ప్రగతి పత్రాలపై తల్లిదండ్రులతో సమగ్రంగా చర్చ జరిగేలా ప్రణాళికల రూపొందించుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి వారిని ఘనంగా ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలోని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీస్ కవాతు మైదానంలో సిద్ధం చేసిన హెలిప్యాడ్, పాఠశాలకు చేరుకునే మార్గంపై చర్చించారు. తదుపరి పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంట సమగ్ర శిక్ష అభియాన్ ఎస్ పిడి శ్రీనివాసరావు, విద్యాశాఖ ఆర్‌జెడి, జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు, వివిధశాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

పంట నమోదు పరిశీలన

విశాలాంధ్ర-బేస్తవారిపేట : మండలంలోని చెట్టిచర్ల గ్రామంలో మండల వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ గురువారం రబీ సీజన్‌కి సంభందించి పంట నమోదును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు వారు సాగు చేసిన పంటను తప్పని సరిగా పంట నమోదు చేయించుకోవాలని, పంట నమోదు చేయించుకోవటం వల్ల సున్నా వడ్డీ, పంట రుణాలు, పంటల బీమా చేయించుకొనుటకు, ప్రకృతి వైపరీత్యాల వలన జరిగే పంట నష్టపరిహారాన్ని పొందుటకు, రైతులు పండిన పంటను ప్రభుత్వానికి అమ్ముకోవడానికి ఈ-పంట నమోదు ప్రామాణిక మని, తప్పని సరిగా పంట నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారి నారా ఆది గణేష్, గ్రామ ఉద్యాన సహాయకులు జ్యోతి పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై పోలీసుల దాడులు

విశాలాంధ్ర-బేస్తవారిపేట : బేస్తవారిపేట పట్టణంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓ బెల్ట్ షాపుపై గురువారం ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కొండారెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎన్ నరేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 14 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్స్పెక్టర్ కొండారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం తరలించినా, అక్రమంగా మద్యం కలిగి ఉన్నా, అమ్మినా ప్రోహిబిషన్ ఎక్సైజ్ వారికి వెంటనే సమాచారం అందించాలని కోరారు.

కుట్టు మిషన్ పంపిణీ

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : వాసవిక్లబ్ ఆధ్వర్యంలో గురువారం కుట్టుమిషన్ పంపిణీ చేసారు. ఈ కుట్టుమిషన్ గతంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వాసవి క్లబ్, ఆదేశాలమేరకు ఉప్పు గుండూరు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ తయారు చేసి గవర్నమెంట్ పాఠశాలల్లో, కాలేజీల్లో ప్రభుత్వ కార్యాల యాల్లో చల్లినందుకు ప్రోత్సహంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్ రవిచంద్రన్ కుట్టు మిషన్ మంజూరు చేసారు. ఆ కుట్టు మిషన్‌ను వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ వైస్ ప్రెసిడెంట్ కొంజేటి వెంకట సురేష్ బాబు చేతుల మీదుగా కోడూరి భారతికి అందచేసారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఐదో తేదీన ఎన్నికల ప్రకటన జారీ చేయాలన్నారు. డిసెంబర్ 8వ తేదీన నీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలో 1,944 టెరిటోరియల్ కానిస్టెన్సీస్ ఉన్నాయన్నారు. ఇందులో ఒక్కొక్క సభ్యుడి ఎన్నిక జరగాలన్నారు. 170 నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు జరపాలన్నారు. డిసెంబర్ 11వ తేదీన 22 డిసి (కాల్వ కమిటీలు) ఎన్నిక జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 14వ తేదీన కె డబ్ల్యు డి (పశ్చిమ కృష్ణ డెల్టా) ప్రాజెక్ట్ కమిటీకి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. సమస్యలు ఉత్పన్నం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వర్, జల వనరుల శాఖ ఎస్ఈ అబూతలీమ్, ఈ ఈ వెంకటరత్నం, ఇంజినీరింగ్ అధికారులు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందించాలి

మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహాత్మా జ్యోతి బా పూలే లాంటి మహనీయుల అడుగుజాడల్లో నడుచుకుంటూ వారి ఆశయాలను, వారి ఆదర్శాలను ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిభా పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఉదయం ఒంగోలు నగరంలోని నూతన కూరగాయల మార్కెట్ వద్ద గల మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, ఎపి టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డా. నూకసాని బాలాజీ, నగర మేయర్ గంగాడ సుజాత, వివిధ బిసి సంఘాల ప్రతినిధులు పూల మాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ఈ రోజు మహాత్మా జ్యోతి బా పూలే వర్ధంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులర్పించడం జరిగిందన్నారు. వారు సమాజానికి చేసినటువంటి సేవలు వెలకట్టలేనివన్నారు. దాదాపు 200 సంవత్సరాల క్రితం జన్మించినప్పటికినీ ఆనాటి సామాజిక రుగ్మతలను రూపుమాపాలంటే విద్య తోనే సాధ్యమని గ్రహించి, తను చదువు కోవడంతో పాటు మహిళా విద్యను ప్రోత్సహిస్తూ సామాజిక రుగ్మతలను సమాజం నుండి తరిమికొట్టేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. వారి దంపతుల ఇద్దరు కూడా ఆనాడు సమాజములో నెలకొన్న వివక్షత, మూఢ నమ్మకాల పై ఉద్యమాలు చేశారని మంత్రి అన్నారు. ఈ రోజు వారు చనిపోయి దగ్గర దగ్గరగా 130 సంవత్సరాలు అయినప్పటికినీ వారి సేవలను గుర్తు పెట్టుకుంటూ జాతి యావత్తు వారికి నివాళి అర్పిస్తున్నారంటే వారి చేసినటువంటి కృషిని మనం మర్చిపోలేమన్నారు. ఈ రోజూ వారే కాదు డా. బి.ఆర్ అంబేద్కర్ వంటి వారు సమాజానికి చేసినటువంటి సేవలు మనకు స్ఫూర్తిదాయకమన్నారు. పూలే దంపతులు సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. దేశంలో మహిళా విద్యకు ఆద్యులు పూలే దంపతులని, జ్యోతి బా పూలే, డా. అంబేద్కర్ స్ఫూర్తితో సమాజంలో అసమానతలు తొలగించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా మాట్లాడుతూ సాంఘిక సంఘ సంస్కర్త, మహిళల అభివృద్ధికి, సమ సమాజ స్థాపన స్ఫూర్తిదాత అయిన మహాత్మా జ్యోతి బా పూలే వర్ధంతి సందర్భంగా ఈ రోజు వారికి నివాళి అర్పించడం జరిగిందన్నారు. వారు స్త్రీ విద్య అవసరాన్ని గుర్తించి మహిళల కోసం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటుచేసి మహిళా విద్యకు కృషి చేశారన్నారు. అదేవిధంగా ఆనాడు సమాజంలో వున్న కుల వివక్షతను, మూఢ నమ్మకాలపై పోరాడన్నారు. అన్ని రంగాల్లో వారు సేవలను అందించి తనదైన ముద్ర వేసుకున్న మహనీయులు మహాత్మా జ్యోతి బా పూలే అని, వారిని మనమంతా స్ఫూర్తిగా ఆదర్శంగా తీసుకొని మన ప్రకాశం జిల్లాను కూడా ఒక సమసమాజ సమగ్రాభివృద్ధికి, వంద శాతం అక్షరాస్యత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎపి టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డా. నూకసాని బాలాజీ మాట్లాడుతూ సామాజిక వివక్షతకు, అసమానతలకు వ్యతిరేకంగా 200 సంవత్సరాల కితమే పోరాడిన మహనీయులు మహాత్మా జ్యోతి బా పూలే అని అన్నారు. సమాజంలో అన్నీ వర్గాలు సమ భాగంగా, సమానంగా ఉన్నప్పుడే సమాజం కూడా గౌరవ ప్రదంగా, అభివృద్ధి పథంగా వుంటుందన్న ఆలోచనతో సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయులు మహాత్మా జ్యోతి బా పూలే అని అన్నారు. ఆనాడు శూద్రులు, మహిళలు విద్యకు దూరంగా వున్నారని గ్రహించి సమాజం విద్యతోనే అభివృద్ధి సాధ్యమౌతుందని విశ్వసించి మహిళా విద్యకు కృషి చేసి దేశంలో సామాజిక చైతన్యానికి నాంధి పలికారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని మాకు గురువు, మాకు చైతన్య స్ఫూర్తి అని డా. బి. ఆర్ అంబేద్కర్ చెప్పారన్నారు.

వారిని స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసుకొని సమాజంలో జరిగే రుగ్మతలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ రెండు వందల సంవత్సరాల క్రితమే ఆనాటి సామాజిక పరిస్థితుల నేపథ్యంలో సాంఘిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతి బా పూలే అని అన్నారు. స్త్రీ విద్య ఆవశ్యకతను గుర్తించి తన భార్య ను కూడా చదివించి మహిళా విద్యకు కృషి చేసిన మహనీయులన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి కార్పొరేషన్ ఈడి వెంకటేశ్వర రావు, డిడి సోషల్ వెల్ఫేర్ లక్ష్మా నాయక్, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి అంజల, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, ఎస్. సి కార్పొరేషన్ ఈడి అర్జున్ నాయక్, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు నీలం నాగేంద్ర రావు, గంట సుబ్బారావు, దారా అంజయ్య, బంకా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వడియ రాజులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

ఎమ్మెల్యే దామచర్లను కోరిన తన్నీరు ఆంజనేయులు

విశాలాంధ్ర-ఒంగోలు : తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన వడియ రాజులను గుర్తించి వాటికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఒడియ రాజుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు తన్నీరు ఆంజనేయులు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు కోరారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌ని ఆంధ్రప్రదేశ్ వడియరాజుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు తన్నీరు ఆంజనేయులు మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని వడియరాజుల యొక్క స్థితిగతుల గురించి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీకి కష్టపడి పనిచేసిన వడియరాజులను గుర్తించి వారికి నామినేటి పదవులు అవకాశం కల్పించి రాజకీయంగా ఎదగటానికి, కార్పొరేషన్ ద్వారా ఎక్కువ నిధులు కేటాయించి ఆర్థికంగా ఎదగడానికి సహకరించాల్సిందిగా కోరగా దానికి స్పందించిన శాసనసభ్యులు వడియరాజులకు అన్ని విధాల సహకరించి వారి యొక్క అభివృద్ధికి ఎల్లవేళలా తోడుంటానని హామీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తన్నీరు వీర సాయి, ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షులు తన్నీరు రాజేంద్ర ప్రసాద్, కుంచాల వెంకట సాయి, కుంచాల అంజయ్య మొదలగువారు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

(మొదటిపేజీ తరువాయి)

మూడు పూటలా వాడుకుంటే తగ్గిపోతుందంటూ చెప్పి పంపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వైరల్ ఫీవర్స్ విస్తృతంగా ఉన్నాయి. ప్రతి ఇంటిలో ఒకరిద్దరూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. గత రెండు నెలల నుంచి జిల్లాలో భారీ వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా చల్లబడింది. ఇటీవల కురిసిన వర్షాలకు మురికి వాడల్లో వర్షపునీరు నిల్వ ఉండటం, చెత్తా చెదారం ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోవడం, వాటిని శుభ్రం చేసేవారు లేకపోవడం ఇతరత్రా కారణాలతో వైరల్ ఫీవర్స్ ఎక్కువగా ఉన్నాయి. వైరల్ ఫీవర్‌లకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య అధికారులు హెచ్చరిస్తున్నారు. సీజన్ మార్పుతో పెరిగే సూక్ష్మ క్రిముల వలన వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయని ఇది గాలి, నీటి ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తాయని, వైరల్ ఫీవర్ ఏడు రోజుల వరకు ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలతో పాటు పెద్ద వయసు వారికి జ్వరాల తీవ్రత అధికంగా ఉండటంతో అధిక సంఖ్యలో నగర ప్రజానీకం జలుబు, దగ్గుతో బాధపడుతున్నారు. అయితే కొంతమందికి జ్వర లక్షణాలు రెండు రోజుల్లో తగ్గుతున్నప్పటికీ ఎక్కువ మందికి చికున్ గున్యా లాంటివి సోకి ప్లేట్‌లెట్స్ తగ్గి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలలతో పాటు ప్రైవేటు వైద్యశాలల్లోను రోగులతో కిటకిటలాడుతున్నాయి. అనుమతులు లేని రక్తపరీక్ష కేంద్రాలు పుట్టగొడుగుల్లా నిలుస్తున్నాయి. ప్రైవేటు వైద్యశాలల్లో అయితే వారి వైద్యశాలల్లోనే రక్త పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసుకొని వచ్చిన ప్రతి రోగి దగ్గర నుంచి రకరకాల టెస్టుల పేరుతో వేలకు వేలు వసూలు చేస్తున్నారు. రక్తపరీక్షలకు ఫీజు నియంత్రణ లేకపోవడంతో ఒక్కొక్క వైద్యశాలలో ఒక్కోరకమైన రక్తపరీక్షలకు డబ్బులు వసూలు చేస్తున్నారు. సీజనల్ వ్యాధుల సీజన్ కాబట్టి సహజంగా జ్వరాలు రావడం జరుగుతుంది. దీంతో హాస్పటల్‌కు రోగులు పరుగులు పెడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. ముఖ్యంగా చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి పరిస్థితి విపత్కరంగా ఉన్నవారికి మాత్రమే ఇన్ పేషెంట్‌లుగా చేరాలని సూచిస్తున్నారు. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు వైద్యుల దోపిడి బాగా పెరిగింది. ప్రైవేటు వైద్యశాలల్లో నాణ్యమైన వైద్యం లేకపోవడమే ఇందుకు బలమైన కారణంగా రోగులు చెబుతున్నారు. మందులు రక్త పరీక్షల పరికరాలు అందుబాటులో ఉండాలని కోరుకోవడంతో పాటు ప్రైవేటు వైద్యశాలల్లో ఫీజులు నియంత్రణ ఉండాలని రోగులు ఆవేదనతో వారి బాధను వ్యక్తం చేస్తున్నారు.

బడుగుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు పూలే

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : బడుగులు పేద ప్రజల హక్కుల కోసం పోరాటం చేసిన మహాత్మా జ్యోతి భా పూలే 134వ వర్ధంతి వేడుకలు గురువారం బిసి సంఘం నాయకులు తుంబేటి వెంకట కాశయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కరెంట్ ఆఫీస్ ఆవరణలో ఉన్న పూలే విగ్రహానికి బిసిలు పూల మాల వేసి నివాళులు అర్పించారు. బిసి సంఘం నాయకులు కాశయ్య మాట్లాడుతూ విద్య ద్వారానే పేదల జీవితాలు మార్పు చెందుతాయని బావించి కుల వివక్ష ఉన్న కాలంలోనే పూలే తన భార్యకు చదువు నేర్పించి అమె ద్వారా పేద ప్రజలకు విద్య వచ్చేలా కృషి చేసిన మహా నీయుడని కొని యాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ రజక సంఘం నాయకులు పోలిశెట్టి తిరుపతయ్య, పగడాల ప్రసాద్, పోలిశెట్టి కొండయ్య, బిసి ఉద్యోగ సంఘం నాయకులు పి.వెంకటేశ్వర్లు, సురభి వెంకటేశ్వర్లు, మల్లి, తేజ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలతో అన్నదాతల ఆందోళన

విశాలాంధ్ర-ముండ్లమూరు : వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చోరీలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మారెళ్ళ గ్రామానికి చెందిన రైతు చిరుమామిళ్ల సుబ్బారావు తన పొలంలో 25పవర్ గల విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను తన పొలంలో ఏర్పాటు చేసు కున్నాడు. గురువారం ఉదయం తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్ళగా ట్రాన్స్ఫార్మర్ కని పించలేదు. దీంతో ఆందోళన చెందిన రైతు సుబ్బారావు దగ్గరకు వెళ్లి చూడగా ట్రాన్స్ఫార్మర్ను కు సంబంధించిన వైర్లను కత్తిరించి పురికొసలకు పెద్ద రాళ్లను కట్టి దూరంగా ఏర్పాటు చేసి, ట్రాన్స్ఫార్మర్ను పగలగొట్టి అందులోని రాగి తీగను తీసుకువెళ్లినట్టు రైతు గుర్తించాడు. దీంతో రైతు విద్యుత్ అధికారులకు తెలియజేసి ఆవేదన వ్యక్తం చేశాడు.

బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని ఉప్పుగుండూరు, మాచవరం గ్రామాల మధ్య ఉన్న ఇస్వర్ వాగు, దండువాళ్ళ వాగు లపై ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద మంజూరైన బ్రిడ్జిల నిర్మాణానికి గురువారం స్థానిక శాసన సభ్యులు బీఎన్ విజయకుమార్ శంఖుస్థాపన చేసారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ విజయకుమార్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈరెండు వాగుల వలన వర్షాల పడినప్పుడు వరదలతో మాచవరం రాపర్ల తదతరగ్రామాల ప్రజలు వారం రోజుల పాటు పలుఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. ఈనేపథ్యంలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పదకం క్రింద రోడ్లు బ్రిడ్జుల అభివృద్ధిలో భాగంగా ఈరెండు బ్రిడ్జిలకు సుమారు 6 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈనిర్మాణాలను స్నేహ కన్ స్ట్రక్షన్ వారు చేపడుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ వై మహాలక్ష్మి, పిఐయు డిఇ రమణయ్య, ఏఇ కుమార్, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు తేళ్ళ మనోజ్, కాకర్ల లక్ష్మివరప్రసాదు, కనగాల శ్రీనివాసరావు, సెల్వం, టి జాన్సన్, పీకా బైరేగి, బాబురావు, మెట్టు సుబ్బయ్య, లింగా అంజిరెడ్డి, కాంట్రాక్టర్లు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, నరేంద్ర ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : నాగులుప్పలపాడు మండలంలోని చీర్వానుప్పలపాడు పంచాయతీలోని టి.అగ్రహారం గ్రామానికి చెందిన జాగర్లమూడి అంజమ్మ 57,989 రూపాయలు, జాగర్లమూడి లింగమ్మ 55,178 రూపాయలు మరెళ్ల చిరంజీవి 41,218 రూపాయలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బి.ఎన్.విజయ్ కుమార్ గురువారం పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్, జాగర్లమూడి హరిబాబు, గ్రామ సర్పంచ్ చిన్నమ్మ, మురళీ,ఆళ్ళ నాగార్జున పొద మురళీ, పొద శ్రీధర్ పోలవరపు శ్రీకాంత్, వేణు, వినోద్, సత్యానందం, పరిటాల రఘు, మెట్టు సుబ్బయ్య, కొనిజేటి ధనుష్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీడీవో జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పీసీపల్లి : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రభాకర్ శర్మ జన్మదిన వేడుకలు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఎంపీడీవోకు శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ ఈజీఎస్ సిబ్బంది మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నరసింహారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర-మర్రిపూడి : ఇటీవల మృతి చెందిన మర్రిపూడి మండలం అంకెపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు పి. వెంకట నరసింహారెడ్డి చిత్ర పటానికి గురువారం పూల మాలతో నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గారు మాట్లాడుతూ నరసింహారెడ్డి మరణం టిడిపి పార్టీకి తీరని లోటు అని అన్నారు.

పెట్లూరు సచివాలయంలో మంత్రి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-కొండపి : మండలంలోని పెట్లూరు గ్రామ సచివాలయాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డు తనిఖీ చేసిన డాక్టర్ స్వామి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులు బాధ్యతా యుతంగా పనిచేస్తూ ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలు అందించాలన్నారు. శాఖల వారీగా ఉద్యోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బందిని రేషనలై జేషన్ చేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు.

సమాజ మార్పునకు నిరంతరం కృషి

విశాలాంధ్ర-కనిగిరి : సమాజంలో మార్పు కొరకు అన్నగారిని వర్గాలను హక్కును చేర్చుకునేందుకు విద్య ప్రజలందరికీ అందాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహత్మ జ్యోతిరావు పూలే అని దళిత హక్కుల పోరాట సమితి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ అన్నారు. గురువారం కనిగిరి లోని ఆర్ అండ్ బి బంగ్లా వద్దన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలు చదువుకునే అవకాశాలు కల్పించాలని స్త్రీలకు విద్య అవసరమని సమాజంతో కొట్లాడి పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని అన్నారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేని వివాహమాడి మహిళలందరికీ విద్యను అందించాలని లక్ష్యంతో బాలిక పాఠశాలలు పెట్టి విద్యను అందించేందుకు కృషి చేశారని అన్నారు. నేటి సమాజంలో మహిళలు చదువుతున్నారంటే అందుకు కారణం పూలేనని ఆయన కొనియాడారు. ఈ కార్య క్రమంలో పూలే సేవా సమితి అధ్యక్షులు దేపూరి వెంకటేశ్వర్లు వెంకయ్య లక్కుపోగు అంటూని నూర్ భాషా సంఘం నాయకులు బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు పల్లా మాలకొండయ్య రాయుడు ఉపాధ్యాయులు రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలి

ఒంగోలు ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న

విశాలాంధ్ర-తాళ్లూరు : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో అవగాహనతో ముందుకు సాగాలని ఒంగోలు ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న కోరారు. తూర్పు గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ విద్యా ర్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఇస్తున్న ప్రోత్సాహాన్ని ఉపయోగించికుని చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఇంగ్లీషు, గణితంపై ప్రత్యేక పట్టు సాధించాలని కోరారు. సమాజంలో వివిధ రకాల మనుషులు తమపై చూపిస్తున్న ప్రేమ, అప్యాయతతో పాటు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. బాల్య వివాహాలకు ఎట్టి పరిస్థితులలో ప్రోత్సహించ వద్దని తమతో పాటు సమాజంలో ఎక్కడైనా అవగాహన లేకుండా జరుగుతున్న బాల్య వివాహాలను కూడ అడ్డుకోవాలని కోరారు. విద్యార్థులు భవిష్యత్లో ఎమి సాధిస్తారో అన్న విషయాలను వారి నుండి రాబట్టారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ముందుగా బొద్దికూర పాడులో నూతనంగా ఏర్పాటు చేయటానికి ప్రతిపాదనలు పంపిన పెంట్రోల్ పంపు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ రావు, వీఆర్ఓ రమణా రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సకాలంలో పంట కోత ప్రయోగం చేపట్టాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : రైతులు సాగుచేసిన పొలాల్లో సకాలంలో పంటకు కోత ప్రయోగం చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్ అన్నారు. మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో గురువారం రైతు సేవా కేంద్రంలో రైతులకు పంటలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగం చేపట్టడం ద్వారా దిగుబడిన అంచనా వేయవచ్చు అన్నారు. పంట కోత అనంతరం నిర్వహణ మరియు పంటల విలువ జోడింపు పై అవగాహన కల్పించారు. వివిధ పంటలలో సకాలంలో పంటలు చేపట్టకపోవడం, బెట్ట పరిస్థితులు, పంటలకు సకాలంలో నీరు పెట్టకపోవడం వలన పంట 20 నుండి 30 శాతం ఉత్పత్తి నష్టం జరుగుతున్నది. ఆహార ధాన్యాలు నిల్వ చేసుకునేటప్పుడు వేపాకు, వేప గింజల పొడి కలిపి ఉంచడం వలన ఆరు నెలల వరకు నష్టం జరగకుండా కాపాడుకోవచ్చు అన్నారు. చిరు ధాన్యాలసాగు వంటి ప్రయోజనాలను రైతులకు వివరించారు. సజ్జ పంటలో ఉన్నటువంటి పోషక విలువలను కరపత్రాల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నాగేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు కే గిరిబాబు, డివిఆర్సి కోఆర్డినేటర్ టి డేవిడ్, రైతులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాలో నియామక అందజేత

విశాలాంధ్ర-మార్కాపురం : మాగుంట రాఘవరెడ్డి, శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్ మేళా కార్యక్రమం జరిగింది. ఈ జాబ్ మేళాలో సుమారుగా 100 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో మెగా జాబ్ మేళాకు హాజరై ఇంటర్వ్యూలకు నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా మాగుంట రాఘవ రెడ్డి, శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన మార్కాపురం ఏరియాలో జాబ్ మేళా నిర్వహించడం సంతోషదాయకమని, దీని ద్వారా వేల సంఖ్యలో నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన జరుగుతుందని, తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని విడుదల చేయడం జరిగిందని అన్నారు. గత ఐదు సంవత్సరాల పరిపాలన కాలంలో ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయలేదని అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ సంస్థ దృష్టిలో ఉంచుకొని లక్షల సంఖ్యలో

ఉద్యోగాలు ఇచ్చేందుకు పెద్ద ఎత్తున రాష్ట్రానికి భారీ పరిశ్రమలు రాబట్టేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి కుమారుడు రాఘవరెడ్డి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు.

యాదవుల కార్తీక వన భోజన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-కొండకనమిట్ల : యాదవ కార్తీక వన భోజన మహోత్సవం డిసెంబర్ నెల ఒకటవ తేదీన ఆదివారం కొత్తపట్నం లోని నల్లూరి గార్డెన్స్ లో జరుగుతుందని, జిల్లా యాదవ సంఘం నాయకులు రాచగర్ల వెంకటరావు తెలిపారు. గురువారం మండలంలోని గొట్లగట్టులో యాదవ కార్తిక వనభోజన మహోత్సవం బ్రోచర్ను ఆవిష్కరించి ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని యాదవ సోదరులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు చల్లా లక్ష్మీనారాయణ, గోళ్ళ వెంకటేశ్వర్లు, కొనకనమిట్ల మండల యాదవ సంఘం నాయకులు మోర బోయిన బాబురావు, నాయకులు యాదవ సంఘం నాయకులు మాజీ ఎంపీటీసీ సభ్యుడు కందిర నాసరయ్య, వీర్ల బాల వెంకటేశ్వర్లు కనకం నరసింహారావు, భయ్యా నాగేశ్వరరావు వల్ల నరసింహారావు ఎం ప్రసాద్ ఏళ్ల శ్రీనివాసులు వేల్పులు తిరుపతయ్య, చావలి మురళి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి

విశాలాంధ్ర-పామూరు : స్థానిక వైసీపీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే 134 వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలతో ఘన నివాళులు అర్పించారు. వైసిపి నాయకులు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను, కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అంబటి కొండారెడ్డి, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్, పట్టణ వైసిపి అధ్యక్షులు షైక్ చాంద్ బాషా, మండల బూతు కమిటీ అధ్యక్షులు గట్లా విజయభాస్కర్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ నాయబ్ రసూల్,ఎస్టీ సెల్ నాయకులు శ్రీరామ్ శ్రీనివాసులు,ఇర్రి వినోద్ రెడ్డి,రసూల్ ఖాన్, కాలేషా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా బక్కా వెంకటేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ ఐపీఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఒంగోలు నీటి పరీక్షా కేంద్రం జూనియర్ అసిస్టెంట్ బక్కా వెంకటేశ్వర్ రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు తెలియజేశారు. గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగి బాధ్యతలు ఒకవైపు, హక్కులు మరోవైపు ఉంటాయని ఉద్యోగుల హక్కులను కాపాడేది సంఘమేనని వినుకొండ రాజారావు స్పష్టం చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లక్ష్మి, వెంకటేశ్వర్ రెడ్డికి బొకే అందజేసి అభినందిస్తూ సంఘం కార్యవర్గ సభ్యులుగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ రాజారావు ఉపాధ్యక్షురాలు లక్ష్మి జాయింట్ సెక్రెటరీ జయప్రకాష్ కోశాధికారి శివకుమార్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వాణి, నాగేశ్వర్ రెడ్డి రామకృష్ణ, వెంకట్రావు పాల్గొని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన బి.వెంకటేశ్వర రెడ్డిని అభినందించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-కంభం : కంభం పట్టణంలోని వాసవి జూనియర్ కళాశాల నందు గురువారం కంభం సీఐ మల్లికార్జున్ విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ నేరాలపై మరియు గంజాయి, డ్రగ్స్, మద్యం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, అలాగే మహిళలు, బాలికలపై నేరాలు, రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుడిపాటి పల్లెలో చిల్లచెట్ల తొలగింపు

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని గుడిపాటిపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో సర్పంచ్ దంపతులు కటికల రిబ్కా వెంకటరత్నం సహకారంతో వార్డు సభ్యులు కటికల అశోక్ పర్యవేక్షణలో రోడ్లకు ఇరువైపుగా మొలిచిన ముల్లకంప, చిల్లచెట్లను జెసిబి సహాయంతో తొలగించారు. గ్రామ పరిశుభ్రతలో భాగంగా రోడ్ల సుబ్రం చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలలో ఎలాంటి పిచ్చి మొక్కలు మొలవకుండా తగు జాగ్రత్తలు తీసుకొని గ్రామపంచాయతీ అభ్యున్నతికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గోన ఇమ్మానియేల్, గోన సాల్మన్ పాల్గొన్నారు.

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-గిద్దలూరు : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ కె.శ్యాంబాబు గిద్దలూరులోని సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. విచారణలో ఉన్న ఖైదీలకు అందుకున్న వసతులను పరిశీలించారు. విచారణ ఖైదీలకు న్యాయవాది ఉన్నారా లేరా అని అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్‌గా లాయర్‌ను పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని అందజేస్తామన్నారు. అందుకు సంబంధించి సంబంధిత న్యాయసేవాధికార సంస్థకు జైలు అధికారుల ద్వారా అర్జీ పెట్టుకోవచ్చు అన్నారు. ఉచిత న్యాయ సహాయము, బెయిల్స్, న్యాయ సేవాధికార సంస్థల చట్టం గురించి విచారణ ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరెండెంట్ యా లింగారెడ్డి, సబ్ జైల్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూధ నరావు మరియు విచారణ ఖైదీలు ఉన్నారు.

పంటపొలాల పరిశీలన

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని పెదారికట్ల సిద్దవరం గ్రామాల్లో రైతులు సాగు చేసిన మినుము, కంది పంటలను గురువారం దర్శి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సంధ్యారాణి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డిడిఏ ఎస్ రామ్మోహన్, వ్యవసాయ అధికారులు కే ప్రసన్న రంగ లక్ష్మి, శైలజ, శేషమ్మ ఆయా గ్రామాల గ్రామ వ్యవ సాయ సహాయకులు జి.గంగయ్య, శ్రీరామ్‌రెడ్డి, ఏఈఓ విక్రమ్ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకోసం జ్యోతిరావు పూలే నిరంతర కృషి

విశాలాంధ్ర-ఒంగోలు : బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతో సేవ చేసిన వ్యక్తి జ్యోతి రావు పూలే అని ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం ఒంగోలు జిల్లా పార్టీ ఆఫీస్‌లో 137 వ వర్ధంతి సందర్భముగా పూల

మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం బాలికా విద్య స్త్రీల హక్కులు అణగారిన జాతులకు ఉచిత విద్యా బోధనతో పాటు దేశం లో మొదటి గా మహిళా స్కూల్ ను ఏర్పాటు చేసి వారి విద్యకు నాంది పలికిన వ్యక్తి పూలే అని అన్నారు. దళితులు వెనుకబడిన తరగతుల వారి అభ్యున్నతి ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఇంచార్జి చుండూరి రవి,పట్టణ పార్టీ అధ్యక్షులు కఠారి శంకర్,మాజీ ఎంఎల్ఏ ఆదెన్న,రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు కుప్పం ప్రసాదు,బి. సి జోనల్ ఇంఛార్జి బొట్ల రామారావు, బొట్ల సుబ్బారావు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కులవ్యవస్థ నిర్మూలనకు పూలే కృషి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పూలే అంటరానితనం,కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశారని వెనుక బడిన కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ ఎర్పాటు చేసి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసినా గొప్ప వ్యక్తి అని వైసీపీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు తెలిపారు.జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిస్తూ బీసీ బడుగు బలహీనవర్గాలకు రాజకీయ విద్యా సంక్షేమ పథకాలను అందజేశారని మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా పార్టి నాయకులుతో కలసి చిల్ రోడ్ సెంటర్ లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా వైయస్సార్సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య మాట్లాడుతూ మహనీయులను స్మరించుకుంటూ పూలే ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. సమసమాజ స్థాపనకు,బాలిక విద్యకు ఆయన కృషి గొప్పదన్నారు.సామాజిక రుగ్మతలను తొలగించడానికి ఆయన కృషి చేశారన్నారు.సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త,మానవతావాది మహాత్మా జ్యోతిబా పూలే అన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు బీసీ మహిళలకు బీసీలకు 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటినా బీసీలకు ఏమి న్యాయం చేయలేదన్నారు.కూటమి ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకున్నారని ఇదంతా బీసీ వర్గాల ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు.నాడు మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి బీసీలకు రాజ్యసభ సభ్యులుగా,56 బీసీ కార్పొరేషన్ ఛైర్మన్లుగా రాష్ట్రంలో వున్న బీసీలకు పెద్దపీట వేశారన్నారు.మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌లుగా బాపట్ల బీసీ వర్గాలకు మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా జిల్లా బీసీ విభాగ అధ్యక్షులుగా వైసీపీ మండల అధ్యక్షులుగా బీసీ కులాలలో వున్న అన్ని వర్గాల నాయకులకు రాజకీయంగా అవకాశాలు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గవిని కృష్ణమూర్తి,మండల వైసీపీ అధ్యక్షులు కోకి రామవరెడ్డి,కర్లపాలెం మండల అధ్యక్షులు నర్రా ఏడుకొండలు,పీటా వేణు,సాయిల మురళీ,మోర్ల సముద్రాలు,జోగిరాజా,పిన్నిబోయిన ప్రసాద్, నర్రా వెంకట్రావు,నర్రావుల వెంకట్రావు,ఎస్.రమేష్,ఆట్ల నాగేశ్వరరెడ్డి,షేక్ సుభానీలు నివాళులర్పించారు.

ప్రజా ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే :కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజా ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి కార్యక్రమం గురువారం బాపట్లలో జరిగింది.స్థానిక పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.మహిళలకు విద్య అవసరమని గుర్తించిన మేధావిగా అభివర్ణించారు. ప్రజలలో చైతన్యం తెచ్చిన మహనీయులని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా,జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి అధికారి రాజేష్ దాసు,బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు రూ.25 వేలు విరాళం

విశాలాంధ్ర - రేపల్లె : ఇటీవల టీడీపీ నాయకుడు ఆకస్మికంగా మరణించిన ఎల్‌వి ఎస్‌వి ప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి మోర్ల అరుణకుమారి తెలుగు మహిళ ప్రతినిధి అన్న క్యాంటీన్‌కు రూ.25 వేలు విరాళం చెక్కును రేపల్లె మున్సిపల్ కమిషనర్ కే.సాంబశివరావుకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. అన్న క్యాంటీన్లో ఈనెల 30వ తేదీ శనివారం స్వర్గీయ ప్రసాద్ జ్ఞాపకార్థం అన్న క్యాంటీన్‌కి వచ్చిన వారందరికీ ఉచితంగా భోజనం అరుణకుమారి ఏర్పాటు చేస్తున్నారు.కమిషనర్ అరుణ కుమారిని అభినందించారు.

30న పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - రేపల్లె : డిసెంబర్ నెల సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమం డిసెంబర్ 1వ తేదీ ఆదివారం వచ్చిన కారణంగా ఈనెల 30న పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీవో శోభారాణి తెలిపారు.అదేవిధంగా నవంబర్ నెలలో పింఛన్ తీసుకొనని వారికి నవంబర్ నెల నగదు కలిపి రెండు నెలల మొత్తం పంపిణీ చేయడం జరుగుతుందని శోభారాణి గురువారం తెలిపారు.

30న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - రేపల్లె : రోటరీ క్లబ్ శంకర కంటి హాస్పటల్ పెదకాకాని గుంటూరు వారి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న 21వ ఉచిత కంటి మెగా వైద్య శిబిరం ఈనెల 30వ తేదీ శనివారం రేపల్లె ఉప్పూడి రోడ్‌లోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ చైర్మన్ ఎం.మోహన్‌లాల్ సక్సేన,రోటరీ క్లబ్ అధ్యక్షులు కోడూరి కృష్ణమూర్తి, కార్యదర్శి కేవీ నాగమల్లేశ్వరరావు తెలిపారు.ఈ శిబిరం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందన్నారు. ప్రజలు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా రోటరీ క్లబ్ రూరల్ నిర్వాహకులు కోరారు.

సామాజిక ఉద్యమకారుడు పూలే

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ పార్టీ కార్యాలయంలో టీడిపి సీనియర్ నాయకులు పఠాన్ రాజేష్ పార్టీ నాయకులుతో కలసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనకబడిన కులాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయులు సామాజిక ఉద్యమకారులు ఆయన అని కొనియాడారు.స్త్రీలకు విద్య అవసరమని గుర్తించిన మేధావిగా అభివర్ణించారు.సత్యశోధక్ అనే సంస్థను స్థాపించి సామాజిక సమానత్వం కోసం జీవితం అంత పోరాడిన వ్యక్తి జ్యోతిభ పూలే అని అన్నారు.ఈ కార్యక్రమంలో జంగా జ్యోతి ప్రసాద్,నక్క ప్రకాష్,జి.దుర్గ ప్రసాద్,కె.కొండలు,మణిక్యారావు, నిలంబరం,దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఆర్.విజయబాబు

విశాలాంధ్ర - రేపల్లె : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం వాయుగుండంగా మారే ప్రభావం ఉండటంవల్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కావున డెల్టా రైతులు వరి కోతలు,ఇతర వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు సుకుని అప్రమత్తంగా ఉండాలని రేపల్లె సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఆర్.విజయబాబు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రదేశంలో ఉంచాలని,ఉద్యానవన పంట మొక్కలు,చెట్లు గాలికి పడకుండా నిలబడేందుకు కర్రలు, బాదులతో సపోర్టు ఉంచాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.రైతులు యంత్రాల ద్వారా నూర్పిడి అయిన ధాన్యాన్ని రైతులు వద్ద ఉన్నట్లయితే రైతు సేవా కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు అమ్ముకోవాలని కోరారు. ఏమైనా కోతలు కోసి ఉన్నట్లయితే కుప్పలు వేసుకోవాలని సూచించారు. డిసెంబర్ రెండో ఇదివరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చీరాల : తమ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ అంతర్జాతీయ స్థాయిలో క్రీడారంగంలో విజయాలు సాధించి చీరాలకు మంచి పేరు తేవడం అభినందనీయమనీ చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు.షాట్‌పుట్‌లో బంగారు పతకం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ నాగరాజునీ పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన బెల్దారి కూలీ సాంబశివరావుని గురువారం చీరాల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలకొండయ్య అభినందించి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడారంగంలో రాణించి చీరాలకు మంచి పేరు తెచ్చినందుకు సంతోషంగా ఉందని,రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు అంతర్జాతీయ స్థాయిలో సాధించాలని ఆశ భావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర - చీరాల : మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం యువత ముందుకు సాగాలని బీఎస్పి చీరాల నియోజకవర్గ అధ్యక్షులు కాటి మార్క్ అన్నారు.గురువారం జ్యోతిరావుపూలే 134వ వర్ధంతి సందర్భంగా బీఎస్పీ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో కాటి మార్క్ మాట్లాడుతూ ఇతర కులాల్లో చర్చికి వెళితే కులం మార్చడం లేదని దళిత క్రైస్తవులు చర్చికి వెళితే కులం మార్చడం ఎంతవరకు సబబని అన్నారు.దళితులపై నేటి ప్రభుత్వం వివక్ష చూపుతుందని వివక్షపై పోరాడటమే పూలేకి అర్పించే ఘనమైన నివాళి అన్నారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ విద్యను ప్రోత్సహించిన మహనీయుడు పూలే

విశాలాంధ్ర - చీరాల : సమాజంలోని రుగ్మతలు పారద్రోలేందుకు కృషి చేసి స్త్రీ విద్యను ప్రోత్సహించిన మహనీయుడు మహాత్మ జ్యోతి రావు పూలే అని వైఎస్ఆర్సీపీ నాయకులు అన్నారు.గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భముగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కరణం వెంకటేష్ బాబు ఆదేశాల మేరకు చీరాల గడియార స్థంభం వద్దగల పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - వేమూరు : మండల పరిధిలోని మూడు గ్రామాలకు చెందిన కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను గురువారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా అందజేశారు.జంపని గ్రామానికి చెందిన పెరుగు వరమల్లేశ్వరికి చికిత్స నిమిత్తంగా రూ.37,378లు, కుచ్చెళ్ళపాడు గ్రామానికి చెందిన వెల్లబాటి రాజేష్ వైద్య ఖర్చు నిమిత్తంగా రూ.26,218లు,పెనుమూడి ఇంద్రావతికి రూ.80,000లు చెక్కులను గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఎమ్మెల్యే ఆనందబాబుకు, సీఎంచంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

30న పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : డిసెంబర్ నెల ఒకటవ తారీఖు ఆదివారం రావడంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నవంబర్ నెలలో 30వ తేదీన మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చీరాల మండల ఎంపీడీఓ పి.శివ సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు.పింఛన్ల లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వల్లూరమ్మ హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-టంగుటూరు : టంగుటూరు మండలం వల్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లూరమ్మ వారి దేవస్థానం నందు గురువారం హుండీ లెక్కించారని ఆలయ కార్య నిర్వాహణ అధికారి రమేష్ తెలియజేశారు. 129 రోజులకు గాను 23 లక్షల 49వేల 769 రూపాయలు నగదు, 72 గ్రాములు బంగారు వస్తువులు, 809 గ్రాములు వెండి వస్తువులు వచ్చినవి. ఈ కార్యక్రమాన్ని ఒంగోలు దేవాదాయ ధర్మాదాయశాఖ పరిశీలకులు వేణుగోపాలరావు పర్యవేక్షణలో నిర్వహించారు. అర్చకులు మరియు సిబ్బంది సేవా సంఘం సభ్యులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాలడైరీలో ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-తాళ్లూరు : పాల డైరీలలో పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం అకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ఎక్కువగా పాల కల్తీ జరుగు తున్నట్లు సమాచారం ఉండటంతో పాల డైరీలలో అకస్మిక తనిఖీలు చేపట్టినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి నరసింహారావు తెలిపారు. పాల కేంద్రాల సేకరణ వారు కూడ కల్తీ పాలను గుర్తించి మంచి పాలను మాత్రమే సేకరించాలని కోరారు. ఆరోగ్యానికి హానికరమైన పాలు సేకరి స్తున్నట్లు గుర్తించినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తూర్పు గంగవరం లోని తేజ డైరీలో పాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దర్శి సీఐ రామారావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర-మార్కాపురం : వరద బాధితుల సహాయార్థం ఎస్‌సివికె ఎస్ సి వి కె రీడింగులు నిలయం ఆధ్వర్యంలో రూ. లక్ష చెక్కును ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని గురువారం వారి కార్యాలయంలో రీడింగ్ రూమ్ కమిటీ ఉపాధ్యక్షులు శాసనాల వీరబ్రహ్మం, కమిటీ సభ్యులు పఠాన్ హుస్సేన్ ఖాన్, ఆర్ కె జి నరసింహం తదితరులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కనిగిరి బాల వెంకటరమణ, మాలపాటి వెంకటరెడ్డి, ఇసుపకోల్ల నాగరాజు తదితరులు ఉన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-తాడికొండ : డిసెంబర్ 1న ఆదివారం సెలవు దినం కావడంతో ఈ నెల 30వ తేదీన శని వారం అన్ని రకాల పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీ డీఓ కె.సమతా వాణి గురువారం తెలిపారు. ఉదయం 6 గంటలకు అధికారులందరూ ఆయా సచివాలయాల వద్ద హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో మొత్తం 10,232 మంది లబ్దిదారులకు రూ.4,29,93,500 పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గత నెలలో పింఛను తీసుకోని వారు ఈ నెలలో రెండు నెలలకు కలిపి పింఛను పొందవచ్చని అన్నారు.

ఇల్లు కట్టిస్తానన్న ఎమ్మెల్యే ఎక్కడ...?

- ఆం.వ్య.కా.స.జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్లీ భాగ్య శ్రీధర్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ బాపట్ల పట్టణ రాజీవ్ గాంధీ కాలనీ మూడో వార్డు గడప గడపకు తిరుగుతూ 60 గడపలలో 100 కుటుంబాలుగా నివసిస్తున్న యానా దులకి పక్కా గృహాలు నిర్మించి ఇస్తానని చెప్పిన మాట మరిచారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్లీ భాగ్య శ్రీధర్ ప్రశ్నించారు. ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపుతానంటూ ప్రచారంలో పాల్గొని గెలిచిన వెంటనే మీ అందరకు పక్కా ఇల్లు కట్టిస్తానని మౌలిక వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మీరు ఎక్కడ ఉన్నారన్నారు. బాపట్ల పట్టణం మూడో వార్డు రాజీవ్‌గాంధీ కాలనీ గత రెండు నెలల కిందట కురిసిన వానలకు చెరువులు తలపిస్తుందన్నారు.ఆ ప్రాంతం అధికారులు వస్తున్నారు, పోతున్నారు కానీ ప్రయోజనం ఉండట్లేదని గత 20 సంవత్సరాల నుండి ఈ ప్రాంతంలోనే చిన్న గుడిసె లు వేసుకొని నివసిస్తున్నారన్నారు. వాన పడితే పరిస్థితులు దారుణంగా ఉంటాయని విషపురుగులు, పాము లు సంచరిస్తుంటాయని పిల్లా పెద్దలు రోడ్డు మీదకు రావాలన్న భయం భయంగా వస్తున్న పరిస్థితిని దుర్వా సన వెదజల్లుతుందని విష జ్వరాల బారిన పడుతున్నామని కరెంటు లేదని,మంచినీరు సరఫరా కుళాయి లు లేవన్నారు. సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నామని మా గోడు ఆలకించే నాధుడే లేడని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.ఆ ప్రాంత ప్రజలు అధికార పార్టీ నాయ కులకు చెప్పిన అధికారులకు చెప్పిన మాకు న్యాయం జరగట్లేదని సిపిఐ పార్టీ అండగా ఉండాలని కోరు కుంటూ జెల్లీ భాగ్య శ్రీధర్ చెంతకు చేరారన్నారు.ఈ సందర్భంగా శ్రీధర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి వారి గోడు ఆలకించి ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు.అధికారులకు నాయకు లకు నా నమస్సుమాంజలి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాల అవుతున్న యానాదుల బ్రతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడ లాగే ఉందన్నారు. యానాదుల జీవితాల్లో వెలుగులు నింపుతాం మౌలిక వసతులు కల్పన ధ్యేయంగా పనిచేస్తామని ఫోటోలు ఫోజులిచ్చి వెళ్తున్నారే తప్ప కార్య చరణ శూన్యం అన్నారు.రాజకీయ నాయకుల అధికారంలోకి రాగానే మొట్టమొదటి కార్యచరణ మీకు ఇల్లు కట్టివటం మౌలిక వస తులు క ల్పించటం మా సంకల్పం అంటూ ప్రచారానికి వచ్చి ఓట్లు వేపించు కుంటారే తప్ప తిరిగి మళ్లీ ఐదు సంవత్సరాల వరకు వారి వైపు వారు ఉంటున్న ప్రాంతాల వైపు చూడర న్నారు.స్వయంగా ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోయిన సంవత్సరం కురిసిన వానలకు సందర్శించిన ప్రాంతం రాజీవ్ గాంధీ కాలనీ అని ఆ పర్యటనలో భాగంగా అధికా రంలోకి రాగానే మీ అందరికీ పక్కా ఇళ్లని హామీ ఇచ్చి వాటిని అట కెక్కించారని శ్రీధర్ అన్నారు.రాజీవ్ గాంధీ కాలనీలో ఉంటున్న యానా దులకు పక్కా గృహాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించకపోతే సిపిఐ ప్రభుత్వంపై పోరాడతానికి సిద్ధంగా ఉందని,మీరు చెయ్యని పక్షం లో వారంతా ఓటుతో ప్రభుత్వానికి బుద్ధి చెప్తారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు ఉద్యమాలు ఆగవని హెచ్చరించారు.

అర్జీల పరిష్కారంలో అధికారులు దృష్టి సారించాలి

కలెక్టర్ అరుణ్‌బాబు

విశాలాంధ్ర-నరసరావుపేట : ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సంబంధిత మండల అధికా రులను ఆదేశించారు. నరసరావుపేట రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ సమావేశం మంది రంలో గురువారం రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ఇతర మంత్రుల కార్యాలయం నుండి వచ్చే ఫిర్యా దుల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత నివ్వాల న్నారు. ఫిర్యాదుల పరిష్కారానికై వీఆర్వోలు, క్రింది స్థాయి సిబ్బందికి ఫిర్యాదులు పరిష్కార విషయంలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ని నిర్వహించాలని సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారికి సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు, ఇతర అవసరాల నిమిత్తం నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఐదు కిలోమీటర్ల పరిధిలో ప్రభుత్వ భూములను గుర్తించాలని అధికారులకు సూచించారు. ప్రజా ఫిర్యాదులు పరిష్కరించే విధంగా అర్జీదారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. అర్జీదారులతో సహృద్భావ వాతావరణంలో మసలుకోవాలన్నారు. రెవిన్యూ సంబంధిత విషయాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతివారం ప్రజా ఫిర్యాదుల దినోత్సవ సందర్భంగా వస్తున్న అర్జీలలో 70/808 శాతం భూ సంబంధిత, రెవెన్యూ సంబంధించినవి ఉంటున్నాయన్నారు. మండల స్థాయిలో వచ్చే ఫిర్యాదులను మండల స్థాయిలోనే పరిష్కరించేలా చూడాలని, రీ ఓపెన్ అయ్యే కేసులపై అప్రమత్తతో వ్యవహరించి పరిష్కరించాలన్నారు. పరిష్కారం కానీ ఫిర్యాదులు గురించి సంబంధిత ఫిర్యాదుదారునితో కూలంకుషంగా చర్చించి దాని వివరాలు తెలియచేయాలన్నారు. ఏ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి మధులత మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన

విశాలాంధ్ర-పెదనందిపాడు : భారత ఎన్నికల సంఘం నిర్వహించే క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం కార్యక్రమంలో భాగంగా గురువారం తహశీల్దార్ పి.శంకర్ బాబు స్థానిక పీఏఎస్ కళాశాలలో విద్యార్థులకు ఓటు నమోదు గురించి అవగాహన కల్పించారు. ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన, త్వరలో నిండపోతున్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం జనవరి 5వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మంచి సమాజాన్ని నిర్మించుకోవడానికి ఓటు హక్కు ఒక బహుత్తర అవకాశం అని, ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండా లని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ షేక్ కరిముల్లా, వైస్ ప్రిన్సిపాల్ ప్రతాప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పాతూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు ఒప్పిచర్ల విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - కారంపూడి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 23 నుండి 25వరకు కారంపూడిలోని బ్రాహ్మ నాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు అండర్ 14 బాల బాలికల 68వ రాష్ట్ర స్థాయి ఖోఖోపోటీలు జరిగాయి. ఇందులో భాగంగా కారంపూడి మండలం ఒప్పిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి చదువుతున్న వీరదాసు మనోహర్ ఉమ్మడి గుంటూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిం చి జిల్లాకు ప్రథమ స్థానం రావడంలో కీలక పాత్ర పోషించి మంచి క్రీడా నైపుణ్యాన్ని ప్రద ర్శించి ఆంధ్రప్రదేశ్ ఖోఖో బాలుర జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయు రాలు విజయ లలిత గురువారం తెలిపారు.వీరదాసు మనోహర్ డిసెంబర్ నెలలో మహా రాష్ట్రలో జరిగే అంతర రాష్ట్ర అండర్ 14 ఖో ఖో జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ ఖోఖో బాలుర జట్టుకు ప్రాతి నిధ్యం వహిస్తాడని పాఠశాల వ్యాయామ ఉపా ధ్యాయుడు చిన్న రత్తయ్య తెలిపారు. మనోహ ర్‌ను ఉపాధ్యాయులు ఆశా, దుర్గా దేవి, హను మంతరావు, అబ్దుల్ రఫి, అంజిరెడ్డి, నిర్మల, రమాదేవి, సునీత, కిరణ్ కుమారి బలరాం, సీతా మహాలక్ష్మి, సంధ్యా, విద్యా కమిటీ చైర్మన్ రామకోటేశ్వరరావు, సర్పంచ్ పుష్పలత శివరామ్, గ్రామస్తులు విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

గ్రామాల్లో బ్యాంకింగ్ సేవలు

విశాలాంధ్ర-దాచేపల్లి : సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంకింగ్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించినట్లు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి చెప్పారు. మండలంలోని కేసానపల్లిలో నెలకొల్పిన సిజీజీబీ బ్రాంచిని గురువారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు బ్రాంచి మేనేజర్ బెక్కం నిఖిల అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రమోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు, రైతులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే కొత్తగా ఇక్కడ బ్రాంచి ని పెట్టినట్లు పేర్కొన్నారు. నరసరావుపేట రీజనల్ మేనే జర్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా బ్రాంచి ఉద్యోగులు పాల్గొన్నారు.

బహుజనుల మహాత్ముడు పూలే

విశాలాంధ్ర-ఒంగోలు : బహుజన హక్కుల వేగుచుక్క మహాత్మ పూలే అని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు నివాళులర్పించారు. మహాత్మ జ్యోతిబా పూలే 134వ వర్ధంతి కార్యక్రమం స్థానిక కొత్త మార్కెట్ వద్దగల పూలే విగ్రహం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి మరియు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయ, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ తదితరులు విచ్చేసి మహాత్మ పూలే విగ్రహానికి నీలం నాగేంద్రరావు పాటు పూలమాలలు వేసి పూలే విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సంద

ర్భంగా నీలం నాగేంద్ర విద్యాధికుడైన జ్యోతి బా పూలే ఆనాటి కాలంలో మనువాదానికి ఎదురు తిరిగి విద్య నేర్పి విజ్ఞానం వైపు నడిపించా రన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు బంక చిరంజీవి, ధరణికోట లక్ష్మీనారాయణ, గిరిజన నాయకులు గంట సుబ్బారావు మాల మహానాడు నాయకులు దారా అంజయ్య, మక్కెన వర కుమార్ తదితరులు ఉన్నారు.

పామూరులో....

విశాలాంధ్ర-పామూరు : పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని ఏపీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గుంటగాని పేతురు అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే 134 వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వ హించారు. మైనార్టీ సెల్ అధ్యక్షులు కొడిగుంపల్లి నాయబ్ రసూల్ ఎస్ టి సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకసాని రవికుమార్ మహిళ అధ్యక్షు రాలు జక్కుల వెంకట లక్ష్మీ యూత్ అధ్యక్షులు శేషం పురుషోత్తం నేలపాటి మాల్యాద్రి సభ్యులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

విశాలాంధ్ర-టంగుటూరు: టంగుటూరు మండలం వెంకటాయపాలెం గ్రామంలో ఆరుబయట నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం అర్ధరాత్రి టంగుటూరు పోలీసులు దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 13,390 రూపాయల నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమో దు చేసి కోర్టులో హాజరు పరుస్తామని టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు. మండలంలో పేకాట బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై చట్టపరమైన కఠిన నిర్ణయాలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి బీవీ స్వామి

విశాలాంధ్ర-కొండపి : అభివృద్ధి సంక్షేమం ప్రభుత్వ ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పాల న చేస్తుందని రాష్ట్ర మంత్రి డాక్టర్ డి ఎస్ బీవీస్వామి తెలిపారు. కొండపి మండలం ముప్పవరం గ్రామంలో జరుగుతున్న సైడ్ కాలువల నిర్మాణ పనులను గురువారం మంత్రి స్వామి పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సైతం పెద్దపీట వేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భైరవకోనను సందర్శించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన, శైవ క్షేత్రమైన భైరవకోనను త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని కందుకూరు ఎమ్మెల్యే సతీమణి సౌజన్య, కుమారుడు అవినాష్ గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారు భైరవకోనలోని జలపాతాన్ని తిల కించిన అనంతరం త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని, కాళభైరవేశ్వరస్వామికి శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

త్రిముఖ దుర్గాంబను దర్శించుకున్న కదిరి కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన, శైవ క్షేత్రమైన భైరవకోనను త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు కుటుంబ సభ్యులు గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు సతీమణి శ్రీదేవి, వాణి ,కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రెటరీ కదిరి పార్థసారధి సతీమణి వసంత భైరవ కోన జలపాతాన్ని సందర్శించిన అనంతరం భైరవకో నలోని త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని, కాళభైర వేశ్వరస్వామిని, శివలింగాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ వంశీ కృష్ణారెడ్డి సూచన మేరకు ఆలయ ప్రధాన అర్చకులు రామ్మూర్తి శర్మ వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆలోచింప చేసిన 'కవనవిజయం'

విశాలాంధ్ర-ఒంగోలు : ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం నేతృత్వంలో పర్వ తనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగుశాఖ పక్షాన నాగభైరవ కోటేశ్వరరావు విరచిత "కవన విజయం" సాహిత్య రూపకం 515వ ప్రదర్శన గురువారం సిద్ధార్థ ఆడిటోరియంలో ఆ ద్యంతం హృద్యంగా సాగింది. తొలుత సింహాద్రి జ్యోతిర్మయి కవులను సభకు పరిచయం చేశారు. డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ ప్రయోక్తగా వ్యవహరించారు. సిహెచ్. ఏడుకొండలు(ప్రబంధకవి),న ట్టే ప్రసాద్ (భావకవి), కప్పగంతు జయరామయ్య (అభ్యుదయ కవి), ఈదుమూడి ఆంజ నేయులు(విప్లవకవి),డా. నూనె అంకమ్మరావు (దిగంబరకవి), డా. బీరం సుందరరావు (దళి తకవి), శ్రీమతి తేళ్ళ అరుణ (స్త్రీవాద కవయిత్రి), కసుకుర్తి శ్రీనివాసరావు(సినీకవి), నూక తోటి శరత్ బాబు(ప్రజాకవి), ఈదుమూడి జయంతి (నవలా రచయిత్రి), బత్తుల బ్రహ్మారెడ్డి (క్లార్క్ సూర్యారావు) కవితా గానం చేసి అలరింపచేశారు. సమకాలీన సమాజంపై ప్రముఖ కవుల అక్షర శతఘ్నులతో సభ మార్మోగింది. ఈ సాహిత్య రూపకాన్ని తిలకించిన విద్యా ర్థులు హర్షాతిరేకాలు తెలియ చేశారు. కళాపీఠం పాలకవర్గ సభ్యులు తాతినేని శ్రీహరిరావు, ప్రిన్సిపల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, కళాశాల డీన్ ఆచార్య రాజేష్ సి. జంపాల, కవుల పాత్ర లను పోషించి నవరిని, సాహి తీవేత్త డా. భూసురపల్లి వెంకటే శ్వర్లును ఘనంగా సత్కరించా రు. తెలుగు శాఖాధిపతి డా. నందనవనం శివకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్రీ, జి. శేషారత్నం ఈ కార్యక్రమం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల అధ్యాపకులు, విద్యా ర్థులు పాల్గొన్నారు. నగరంలో ని వివిధ సాహితీ, కళాసంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నా రు. ఈ సందర్భంగా విద్యా ర్థులు స్పందిస్తూ ఈ సాహిత్య కార్యక్రమం ద్వారా ప్రముఖ కవుల పదునైన భావాలను, వారి సాహిత్య ప్రయోగాలను తెలుసుకోగలిగామన్నారు.

చారిత్రాత్మక ప్రదేశాలను అభివృద్ధి చేయండి

- డాక్టర్ నూకసానిని కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

విశాలాంధ్ర-ఒంగోలు : విజయవాడలో ఏపీ టూరిజం కార్పొరేషన్ కార్యాలయంలో ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీని ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మార్కాపురం నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త షేక్ సైదా,జిల్లాలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వ యకర్తలు, ముఖ్య నాయకులతో కలిసి జిల్లాలో తమ కార్పొరేషన్ ద్వారా కొత్తపట్నం బీచ్, భైరవకోన, చంద వరం బౌద్ధారామ క్షేత్రం, పాదిలి లక్ష్మీనరసింహస్వామి కొండ, నెమలి గుండ్ల రంగనాయక స్వామి ఆలయంతో పాటు జిల్లాలో పార్కు ల నిర్మాణం, కాటేజీల నిర్మాణం, టూరిజం అభివృద్ధికి పాటుపడాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా ఆయనకు దుశ్శా లువాతో పూలబొకే తో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఒంగోలు, సంతనూతలపాడు, దర్శి, గిద్దలూరు, కనిగిరి నియోజక వర్గాల పార్టీ సమన్వ యకర్తలు బి. ఆర్ .గౌస్, పాలపర్తి విజేష్ రాజ్, కైపు వెంకటకృష్ణారెడ్డి, పగడా ల రంగస్వామి, దేవరపల్లి సుబ్బారెడ్డి , మేడబలిమి వెంకటేశ్వరరావు, బొద్దు సతీష్, శ్రీ గోరంట్ల కోటేశ్వరరావు, సుధీర్, గోపి, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్ మిత్రుల ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు రంగ రాయుడు చెరువు వాకర్స్ అండ్ జిమ్ మేట్స్ ఆధ్వ ర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం గాంధీ పార్క్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్త్రీ పురుష వాకర్స్ మిత్రులు హాజరయ్యారు. కార్యక్రమ నిర్వాహకులు పైనం మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ యక్కల తులసిరావు, సీనియర్ అడ్వకేట్ సిరిగిరి రంగారావు మాట్లాడుతూ అనునిత్యం వాకింగ్ చేస్తూ ఒకరినొకరు పలకరించుకుంటూ ఆప్యాయంగా ఉండే వాకర్స్ అందరూ కలిసి కార్తీక వనభోజనాల కార్యక్రమం ఏర్పాటు చేసుకోవడం మంచి సాంప్రదాయమని పేర్కొన్నారు. ప్రతి ఏడాది కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించాలని దానికి సంపూర్ణ సహకారం అందజేస్తామని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో శ్యామ్, శ్రీదేవి, రమ, మరియమ్మ, బంగారయ్య, రాము, చిరంజీవి, గంగాధర్, తిమోతి, భారతి, కొట్టెకొండయ్య, ప్రశాంత్, షాలిని, యాజ్ దాన్ రామారావు, వెంకట్రావు, నాగరాజు, చిరంజీవి, విజయ, ఇందిరా, వెంకటలక్ష్మి, సీత వెంకటరత్నం, శైలజ, రత్న తదితరులు పాల్గొన్నారు.

పేస్ విద్యార్థికి ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్‌గా గుర్తింపు

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాల నందు నాలుగవ సంవత్స రం చదువుతున్న మరియు 34(ఆంధ్ర) బెటాలి యన్ కి చెందిన సీనియర్ అండర్ ఆఫీసర్. శివ నారాయణ. కుందురు తమ శిక్షణ లో భాగంగా ప్రతిభను కనపరిచినందుకు గాను ఉత్తమ క్యాడెట్‌గా గుర్తింపు లభించింది. ఈ పురస్కారాన్ని గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్. ఎం. చంద్ర శేఖర్ మరియు 34(ఆంధ్ర) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మోహన్. వి చేతుల మీదుగా ఎన్‌సీసీ డే సందర్భంగా గుంటూరు గ్రూప్ ప్రధాన కార్యాలయం లో అందజేశారు. ఈ సందర్భగా కళాశాల సెక్రెటరీ మరియు కరస్పాండెంట్ డాక్టర్ మద్ది శెట్టి .శ్రీధర్ విద్యార్థులకు ఎన్ సి సి ట్రైనింగ్ ఎంతో ఉపయోగకరం అని, విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడంలో ఎంతో సాయపడుతుందని అన్నారు. అలానే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. వి. కె. మూర్తి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్. వీరాంజనేయులు , డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ సి. వి. సుబ్బారావు శివ నారాయణ ను , అలాగే కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్. డాక్టర్. ఏ.పృథ్వీ కృష్ణ ను అభినందించారు.

జ్యోతిరావు పూలేకి ఘన నివాళి

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మున్సిపల్ ఆఫీసులో గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గోపువరపు రమాదేవి చంద్రరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణ, కౌన్సిల్ సభ్యులు మేనేజర్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొని వాళ్ళు అర్పించారు. చీమకుర్తి మున్సిపల్ ఐదవ వార్డు మాజీ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, తొరటి నాగేశ్వరరావులు నివాళులర్పించారు. బీసీ నాయకులు చల్లా శ్రీనివాసరావు, గుద్దంటి శ్రీనివాసరావు, పెన్షన్ సంఘం నాయకుడు మరి లక్ష్మీనారాయణ తదితరులు ఘన నివాళు లర్పించారు.

సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని పెదఇర్లపాడు గ్రామపంచాయతీ పరిధిలోని పెద ఇర్లపాడు ఎస్సీ కాలనీ నుంచి పెదఇర్లపాడు లక్ష్మక్క పల్లి ఆర్అండ్ బి మెయిన్ రోడ్డు వరకు సిసి రోడ్ నిర్మాణ పనులకు సర్పంచ్ పోలం లక్ష్మీదేవి జనసేన సెంట్రల్ ఆంధ్ర కమిటీ అధ్యక్షులు మాదాసు రమేష్ బాబు శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నిధులతో కాలనీకి 40 లక్షల రూపాయల అంచనా విలువతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పెద ఇర్లపాడు సర్పంచ్ పోలం లక్ష్మీదేవి జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కమిటీ అధ్యక్షులు మాదాసు రమేష్ బాబు విస్తరణాధికారి డి నాగమల్లేశ్వరి, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటిగుంట్ల వీరయ్య సచివాలయ సిబ్బంది దాసరి అయ్యప్ప మాదాసు బ్రహ్మయ్య అత్యాల రోజేష్ చెంచెయ్య రమేష్ మోషే ప్రజా ప్రతినిధులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకి ఎమ్మెల్యే వేగేశన నివాళి

విశాలాంధ్ర - బాపట్ల : మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా బాపట్ల పట్టణంలోని చీల్‌రోడ్డు వద్ద ఉన్న వారి విగ్రహానికి ఎమ్మెల్యే వేగశన నరేంద్ర వర్మ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి,తాతా జయప్రకాష్ నారాయణ,పమిడి భాస్కర్‌రావు,తెలుగుదేశం,జనసేన,బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

30న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిసెంబర్ 1వ తేదీ ఇవ్వవలసిన ఎన్.టి.ఆర్ భరోసా పెన్షన్లు ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే 30న ఉదయం 5.30 గంటల నుంచి మండలంలో వృద్ధాప్య,వితంతు,దివ్యాంగుల తదితర అన్ని రకాల పెన్షన్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పెన్షన్‌దారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు తెలియజేశారు.

లబ్ధిదారులు ఎన్పీసీఐ లింక్ చేయించుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : సంక్షేమ పథకాల లబ్ధిదారులు తప్పనిసరిగా ఎన్పీసీఐ లింక్ చేయించుకోవాలని ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈ నెల 27 నుండి 30వ తేదీ వరకు పోస్టల్ డిపార్టుమెంట్ వారి ఆధ్వర్యంలో ఎన్పీసీఐ లింక్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు,ఫోన్ నంబరును క్యాంపుల వద్దకు తీసుకువెళ్తే అక్కడి సిబ్బంది ఎన్పీసీఐ లింక్ చేస్తారని చెప్పారు.అలా లింక్ అయిన వారికి మాత్రమే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథ కాలకు సంబంధించిన డబ్బులు లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లో జమ అవుతా యన్నారు.ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

మహిళా ఉత్పత్తులను ప్రోత్సహించండి

విశాలాంధ్ర-చీమకుర్తి : మెప్మా మహిళలు ఇచ్చే తయారు చేయబడిన ఉత్పత్తులను చీమకుర్తి బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన మెప్మా బజార్ ను మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య గురువారం ప్రారంభించారు. వ్యాపారంగంలో మహిళల ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కందిమళ్ళ గంగాధర్ రావు, గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజని, మెప్మా సిబ్బంది, కందిమల్ల గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు వారి జీవన ప్రమాణాల పెంపొందించుట కొరకు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు అందించి వ్యాపారంగంలో రాణించే చెట్లు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి సీనియర్ నాయకులు అవనిగడ్డ శేషారావు, జనసేన నాయకులు తాతినేని శ్రీరామ్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పణి కుమారి, డి.ఇ.ఓ. ఆలూరు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్స్‌ను విధుల్లోకి తీసుకోవాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్

విశాలాంధ్ర - చీరాల : విద్యుత్ శాఖలో మీటర్ రీడర్స్ గత 25 సంవత్సరాలుగా రీడింగ్ తీస్తూ వెన్నుముక్కలా ఉంటూ సేవ చేశారని నేడు ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చి రీడర్స్ ఉద్యోగానికి భద్రత లేకుండా చేశారని ఇన్నేళ్ళు ఈ శాఖకు సేవలందించిన రీడర్స్‌కి ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన న్యాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు.గురువారం చీరాల ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో బత్తుల శ్యాముల్ అధ్యక్షతన మీటర్ రీడర్స్ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మీటర్ రీడర్స్ జిల్లా నాయకులు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో మీటర్ రీడింగులు తీస్తున్నామనీ ఇప్పుడు ప్రభుత్వం స్పాట్ మీటర్లు అంటే మీటర్‌కి సిమ్ సిస్టం పెట్టడంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 300 మంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 4,000 మంది ఉపాధి పోయిందన్నారు.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో మేము మా కుటుంబాలు రోడ్డున పడతామని,మమ్మల్ని ప్రభుత్వం విద్యుత్ శాఖలోకి తీసుకోనీ ఉద్యోగ భద్రత కల్పించాలని నెల నెల వేతనాలు ఇవ్వాలని కోరారు.

అనంతరం చీరాల డివిజన్ నూతన కమిటీ ఎంచుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా ఎస్.రవి డివిజన్ కార్యదర్శిగా ఎస్.రత్నరాజు డివిజన్ కోశాధికారిగా ఎన్.నాగ రాజు డివిజన్ ఉపాధ్యక్షుడు డి.జాను,డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.యోబును ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుంచాల సిద్దయ్య జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పరాజు,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.సతీష్ కుమార్,డానియల్, అశోక్ కుమార్,శ్రీను,మీటర్ రీడర్స్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాల్య వివాహాల ఆలోచనను తుడిచిపెట్టేయాలని బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని జిల్లా టీడీపీ అధ్యక్షులు,బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు పేర్కొన్నారు. దేశంలో బాల్యవివాహాల పరిస్థితి భయంకరంగా ఉందని లెటర్ అండ్ స్పిరిట్‌లో బాల్య వివాహ చట్టాన్ని అమలు చేయడం లేదని పేర్కొన్నారు.బాల్య వివాహాలు జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే మైనర్ల స్వేచ్ఛ, సంకల్పాన్ని ఉల్లంఘించడమేనని సుప్రీంకోర్టు పేర్కొనబడిన్నారు.బాల్య వివాహాలను అరికట్టడానికి బాల్య వివాహ చట్టం కఠినంగా అమలు చేయడం కోసం సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జారీ చేసిందని తెలిపారు.అందరం కలిసి బాల్య వివాహాలా నిర్మూలనకై ఉద్యమించలన్నారు. పట్టణ సీఐ అహ్మద్ జానీ మాట్లాడుతూ బాల్యవివాహాలు ప్రభలంగా ఉన్న ప్రాంతాలలో తప్పనిసరిగా పాఠ్యాంశాలలో దాన్ని నివారణకు సంబంధించిన సమాచారాన్ని చేర్చాలని ఈ తీర్పులో పేర్కొనబడినదన్నారు. 2030 నాటికి భారతదేశాన్ని బాల్య వివాహ రహిత దేశంగా మార్చటానికి వీలైనంత త్వరగా మార్గ దర్శకత్వం అనుసరించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసిందన్నారు. భారతదేశంలో బాల్య వివాహాలను అంతమొందించడానికి కృషిలో భాగంగా సిఫార్ద్ స్వచ్ఛంద సేవా సంస్థ కీలక భాగస్వామిగా ఉందని వెల్లడించారు. భారత దేశంలో బాల్య వివాహ రహిత దేశంగా మార్చడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి బుడా చైర్మన్ సలగల రాజశేఖర్,పట్టణ సీఐ అహ్మద్ జానీ,హాజరై అనంతరం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఎస్.యఫ్.ఐ.ఆర్.డి అధినేత రవి ప్రదీప్,కో-ఆర్డినేటర్ బడుగు కిషోర్,సచివాలయ మహిళా పోలీసులు,అంగన్వాడీ సూపర్ వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

30న పింఛన్ పంపిణీ చేయాలి

కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులకు డిసెంబర్ నెల నగదును ఈనెల 30వ తేదీన పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదు పంపిణీపై జిల్లా అధికారులు,మండల ప్రత్యేక అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు.టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఎండీవోలు,తహసిల్దార్లతోను మాట్లాడారు.పింఛన్ నగదును ముందస్తుగా ఇస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు తెలియపరచాలని చెప్పారు.డిసెంబర్ ఒకటో తేదీన ఆదివారం సెలవు రోజు కావడంతో ముందస్తుగానే నగదు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.దీంతో ముందుగానే బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకోవాలని ఆదేశించారు.30వ తేదీన పింఛన్ ఇస్తామనే విషయాన్ని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సచివాలయాల సిబ్బంది చెప్పాలన్నారు.ఈ విషయంపై విస్తృతమైన ప్రచారం చేయాలన్నారు. శనివారం ఉదయం ఐదున్నర గంటలకే పింఛన్ పంపిణీ ప్రారంభించాలన్నారు. అధికారు లు, సచివాలయాల సిబ్బంది క్రమశిక్షణతో మెలగాలన్నారు.పింఛన్ పంపిణీలో నగదు దుర్వినియోగం చేసినా,అక్రమాలకు పాల్పడినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డి ఎపిడి పద్మజ,అనుబంధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఎక్సైజ్ సర్కిల్ ఇనిస్పెక్టర్ పి.నాగేశ్వరరావు,ఎస్సై బి.శ్రీహరి,ప్రొహిబిషన్,ఎక్సైజ్ ఈఎస్టిఎఫ్ బాపట్ల సిబ్బంది,చీరాల ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది బాపట్ల ఏఈఎస్ ఆధ్వర్యంలో చీరాల రామ్ నగర్‌లో సోదాలు నిర్వహించి నాటు సారాయి తయారు చేయడానికి ఉపయోగపడే బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 450 లీటర్ల బెల్లపు ఊట ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు తెలిపారు.నాటు సారా తయారు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శివాలయంలో ఎమ్మెల్యే వేగేశన ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - బాపట్ల : కార్తీక మాసం సందర్భంగా నందిరాజుతోట గ్రామంలోని శివాలయంలో ఎమ్మెల్యే వేగశన నరేంద్ర వర్మ రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, మండల పార్టీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కందుల బాలకోటేశ్వరరావు,తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.